# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోరా?

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టుల ధర్నా**

**మహబూబ్‌నగర్ రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం**

**కోర్టు కేసు బాధితులకు న్యాయం చేయాలంటూ డిమాండ్**



తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** సర్వే నెంబర్ 25లో నష్టపోయిన సీనియర్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత జర్నలిస్టులు మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారంనాడు నిరసన వ్యక్తం చేశారు. బాధిత జర్నలిస్టులు తెలిపిన వివరాల ప్రకారం నష్టపోయిన జర్నలిస్టులకు న్యాయం చేయాలని ఓవైపు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పినా కూడా మండల రెవెన్యూఅధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. వివరాల ప్రకారం 2014కు ముందు అప్పటి ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు సర్వే నెం 25లో ఇంటి స్థలాలు కేటాయించడం జరిగింది. కానీ అనంతరం ఏర్పడిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణం పేరుతో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ జర్నలిస్టులకు ఇళ్ళు నిర్మించి ఇస్తామని చెప్పి ఇంటి పట్టాలు తీసుకోవడం జరిగింది. తీరా మూడు సంవత్సరాల తరువాత మాజీ మంత్రి నిబంధనల పేరుతో ఆయనకు నచ్చిన జర్నలిస్టులకు, స్థానికేతురులకు, అనుచరులకు పట్టాలు ఇచ్చారు. దింతో పాత పట్టాలు ఉన్న సుమారు 12మంది జర్నలిస్టులకు అన్యాయం జరిగిందని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించారు. దింతో కోర్టు కూడా బాధితుల పక్షాన స్టే కోరడంతో పాటు రెవెన్యూ అధికారులను దీనికి బాధ్యులను చేస్తూ నివేదిక ఇవ్వాలని అడిగారు. విషయంలో స్పందించిన రెవెన్యూ సిబ్బంది కేసులు ఉపసంహరించుకుంటే అందరికీ న్యాయం చేస్తామని చెప్పడం జరిగింది. అదే సమయంలో బాధిత జర్నలిస్టులు విషయాన్ని నూతన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు లేఖ వ్రాసారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కూడా దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, ఎక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి అనే విషయాన్ని తెలియజేయాలని తహసీల్దార్ కార్యాలయం నుండి వివరాలు ఇవ్వాలని కోరడం జరిగింది. అయితే జిల్లా కలెక్టర్ నివేదిక అడిగి రెండు మాసాలు అయినా కూడా రెవిన్యూ అధికారులు మాత్రం ఇంత వరకు నివేదిక పంపకపోవడం గమనార్హం. నిరసన తెలుపుతున్న జర్నలిస్ట్‌లతో తహసీల్దార్ ఫోన్ ద్వారా సంప్రదించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

## రానున్న వేసవిలో నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ప్రస్తుత రబీ, రానున్న వేసవిలో నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న వేసవిలో డిమాండ్ దృష్ట్యా, సరిపడా విద్యుత్ సరఫరా చేయుటకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు గాను అవసరమైన తక్షణ పనులను చేపట్టాలని సూచించారు. వివిధ రకాల పనులు చేపట్టుటకు సుమారు 50 కోట్లతో జిల్లా వ్యాప్తంగా, వివిధ అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉందన్నారు. వాటిలో ముఖ్యంగా అదనపు 33 కెవి, 11 కెవి, ఎల్‌టి లైన్స్ వేయుటకు, 33/11కెవి సబ్ స్టేషన్‌లలో అదనపు పవర్ ట్రాన్స్ఫార్మర్లు, పట్టణాలు, గ్రామాలలో అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులను వేగవంతంగా చేపట్టి వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఫిబ్రవరి మాసాంతం వరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత విద్యుత్ అధికారులను ఆదేశించారు. రబీ/వేసవిలో డిమాండు ఎక్కువ పెరిగే అవకాశం ఉన్నందున ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్.ఈ. తిరుపతి రావు, మూడు సబ్ డివిజన్ల అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లు రమేష్ బాబు, గోవిందు, నవీన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**నవాబుపేట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** నవాబుపేట మండల కేంద్రంలో జడ్చర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దేపల్లి కొల్లూరు ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి దేపల్లె వరకు రూ.4 కోట్ల 15లక్షలతో వేస్తున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఐదేళ్లలో జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. మండలంలోని కొల్లూరు ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి దేపల్లె వరకు రూ.4కోట్ల 15లక్షలతో వేస్తున్న బీటీ రోడ్డు పనులకు నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలనలో పైలెట్ ప్రాజెక్టుగా మీగ్రామం దేపల్లెనీ ఎంపిక చేయడం జరిగిందన్నారు. దాదాపుగా వందకు పైగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించి వారి యొక్క జాబితాను అధికారులు ఫైనల్ చేశారని గుర్తు చేశారు. ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మీ గ్రామానికి రూ. 4 కొట్ల 15 లక్షలతో కొల్లూరు ఆర్‌అండ్‌బి రోడ్డు వరకు బీటీ రోడ్డు మంజూరు చేసి ఈరోజు శంకుస్థాపన చేశానని అన్నారు. అలాగే తహసిల్దార్ మండలంలో ఎక్కడైనా ఐదు ఎకరాల స్థలం కేటాయిస్తే మినీ క్రికెట్ స్టేడియాన్ని మండలానికి తీసుకొస్తానని తెలిపారు. మండలంలోని యన్మన్ గండ్ల, నవాబ్ పేట్ చెరువులకు వాకింగ్ ట్రాక్స్ తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని అన్నారు. నవాబ్ పేట్ మండలం పెద్ద మండలం మరిన్ని నిధులు తీసుకొచ్చి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. గ్రామంలో బీటి రోడ్డు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మండల అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## బాధితులకు న్యాయం చేస్తా : ఎమ్మెల్యే వాకటి శ్రీహరి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణ కేంద్రంలో గతంలో సుభాని అనే వ్యక్తి కొంత మంది దగ్గర నుండి ఎక్కువ వడ్డీని ఆశ చూపించి, వారితో దాదాపుగా రూ. 150 కోట్లను తీసుకొని, ఎగ్గొట్టి మోసం చేశాడు. వారిని కర్నూల్‌లో మొన్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన బాధితులు నేడు పోలీస్ స్టేషన్‌లో ఆందోళన చేయగా, బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చిన స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి, సుబాని దగ్గర నుండి అందరు బాధితులకు డబ్బులు అందేలా చూస్తామన్నారు. పక్క రాష్ట్రంలో గత రెండు నెలల క్రితం నుండి జరుగుతున్న పక్క రాష్ట్రంలో కూడా సుభాని అనే వ్యక్తి మోసం చేసిన సంగతి తెలిసినదే.

## పాలమూరు వీరుడు పండుగ సాయన్న

- ఆయన ఆశయాలను కొనసాగిస్తాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా పండుగ సాయన్న విగ్రహావిష్కరణ
- హాజరైన మండలి డిప్యూటీ చైర్మన్
- బండ ప్రకాశ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పాలమూరు వీరుడు పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తో కలిసి పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం రాబిన్ హుడ్‌గా అవతారం ఎత్తి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేశారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాగానే అందేశ్రీ రచించిన తెలంగాణ రాష్ట్ర గీతంలో పాలమూరు వీరుడు రాబిన్ హుడ్ పండుగ సాయన్న వీర గాధను పొందుపరిచామని, ప్రతి రోజూ ప్రతి పాఠశాలలో ఆయనను స్మరించుకుంటున్నామని ఆయన తెలిపారు. అంతే కాకుండా తెలంగాణ యుద్ధ వీరుల చరిత్రను ఈ రాష్ట్ర గీతంలో పొందుపరచుకోవడం జరిగిందని, ప్రతిరోజూ మన రాష్ట్రంలోని పాఠశాలల్లో ఆ మహావీరుల చరిత్రను గుర్తు చేసుకుంటూ వారిని స్ఫూర్తిని పొందుతున్నారని ఆయన స్పష్టం చేశారు. బిసిలకు 42 రిజర్వేషన్‌లు కల్పించడానికి మళ్ళీ ఒకసారి కులగణన చేస్తున్నామన్నారు. రిజర్వేషన్‌లను కోర్టులు ఆమోదించాలంటే చట్టబద్ధత కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. కాబట్టి గతంలో సర్వేలో ఎవరైనా తమ వివరాలను ఇవ్వకపోయినా ఈసారి సర్వేలో పాల్గొని సర్వేకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బెక్కెం జనార్ధన్ రచించిన పండుగ సాయన్న పుస్తకాన్ని ముఖ్య అతిథులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఎన్‌పి వెంకటేష్, బెక్కెం జనార్ధన్, మెట్టుకాడి ప్రభాకర్, టివి కృష్ణ, మైత్రి యాదయ్య, నాగరాజు , లక్ష్మీనారాయణ, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, రాజు గౌడ్, చంద్రమౌళి, బోల యాదయ్య, జి.యాదయ్య, తిరుపతయ్య , రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

### ఇచ్చిన హామీలను నేరవేరస్తూ..

## గ్రామాలభివృద్ధికి పాటు పడుతున్న ఏకైక ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** తాడూర్ మండలం గుంతకోడూర్ నుంచి యాదిరెడ్డిపల్లి వరకు 2.90 కోట్ల రూపాయలతో నూతనంగా మంజూరు అయిన బిటి రోడ్డుకు యాదిరెడ్డిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే భూమి పూజ, శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన ప్రకారం ఈరోజు రోడ్డు కోసం శంకుస్థాపన చేశారన్నారు. తాడూరు మండలంలో మొదటగా గుంతకోడూర్ గ్రామంలోనే బీటీ రోడ్డుకు శంకుస్థాపన, తాడూరు మండలం మొత్తానికి 50 కోట్లకి పైగా రుణమాఫీ అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, గ్రామ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, చేనప్ రెడ్డి, తాడూరు సింగల్ విండో చైర్మన్ రామచంద్రరెడ్డి, మల్లయ్య మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నూతనంగా నిర్మించిన తరగతి గదుల ప్రారంభం...**

తిమ్మాజీపేట్ మండలం నేరెళ్లపల్లి గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో 53 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించి అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని గొప్ప స్థాయికి రావాలని కోరారు. అలాగే కూచుకుళ్ల ఫౌండేషన్ తరుపున ప్రతి తరగతి గదిలో బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, వెంకటరామిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మాధవ్, నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వివేక్ రెడ్డి, జమీరుద్దీన్, నాగ శైలు, నేరేళ్లపల్లి అధ్యక్షులు రవికుమార్, దామోదర్ రెడ్డి, చేగుంట మన్యం, అశోక్ గౌడ్, రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయతీ అధికారులు



లంచం తీసుకొంటూ ఏసిబీ అధికారులకు దొరికిన పంచాయతీ అధికారులు

**గద్వాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా డీపీఓ శ్యామ్ సుందర్ సూచన మేరకు రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఉన్న పలంగా పుల్లూరు పంచాయితీ కార్య దర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డిని ఏసీబీ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం లో పు ల్లూరు పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ రెడ్డి ,ఏసిబీ అధికారులకు చిక్కారు. పుల్లూరు గ్రామ శివారులో ఓ వెంచర్ మేనేజర్ తో డీపీఓ శ్యామ్ సుందర్ సూచన మేరకు పుల్లూరు పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి రూ.2 లక్షల రూపాయలు లంచం తీసుకుంటుండగా, తన సిబ్బంది తో రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ పట్టుకున్నారు. డీపీఓ కార్యాలయంలో అధికారులు సోదాలు చేశారు. పంచాయితీ అధికారి శ్యామ్ సుందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ రెడ్డి లను ఏసిబీ అధికారులు విచారించారు.

### ప్రభుత్వ కార్యక్రమాలను

## ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలి

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ బెన్ షాలాం తెలిపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారుల డైరీని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు తీసుకువెళ్లి విజయవంతం చేసినందుకు కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ నగేష్, హైమవతి, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

### కేంద్ర ప్రభుత్వ నిధుల

## వినియోగం పై సమీక్ష

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు మంజూరు అయిన పి.యం శ్రీ (పిఎంఎస్ఆర్ఐ), సర్వ శిక్ష అభియాన్ కింద మంజూరు అయిన నిధులను ఫిబ్రవరి 20 లోగా వంద శాతం ఖర్చు చేసిన నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సెక్రటరీ ఎడ్యుకేషన్ డా.యోగితా రాణా శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ ఏడ్యూకేషన్ డా.యోగిత రానా మాట్లాడుతూ పి.యం శ్రీ, సర్వ శిక్ష అభియాన్ కింద ప్రతి సంవత్సరం పాఠశాలల్లో మౌలిక వసతులు, క్షేత్రస్థాయి పరిశీలనల కొరకు విడతల వారీగా నిధులు విడుదల చేస్తుందని, కానీ చాలా జిల్లాలో 50 శాతం సైతం ఖర్చు చేయడం లేదని చెప్పారు. నిధులు ఖర్చు చేసి యూటిలైజేషన్ సర్టిఫికెట్ పంపిస్తే తిరిగి నిధులు విడుదల చేస్తారని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ గ్రీన్ స్కూల్, ఆత్మ రక్షణ, క్షేత్ర స్థాయి పరిశీలన, మౌలిక సదుపాయాలు, స్పోర్ట్స్, సైన్స్ బడ్జెట్ తదితర విభాగాలకు లక్షల్లో నిధులు విడుదల చేయడం జరిగిందని వాటి ఖర్చులు మాత్రం జరగటం లేదన్నారు. ఫిబ్రవరి, 20 లోపు నిధులు అన్ని ఖర్చు చేయాలని యం.ఈ.ఓ లు, పి.యం. శ్రీ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పి.యం. శ్రీ కింద జిల్లాలో (6) ప్రాథమిక పాఠశాలలు, 15 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పి.యం శ్రీ పాఠశాలలు వారం రోజుల్లో నిధులు ఖర్చు చేసి నివేదిక ఇవ్వాలని, ఆపార్ నమోదు సైతం త్వరగా పూర్తి చేయాలని యం.ఈ.ఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘనీ, మండల విద్యా అధికారులు, పి.యం శ్రీ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## చిరుత సంచారంతో భయాందోళనలో గ్రామస్తులు



చిరుత సంచరిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం మద్దేల్ బీడ్ గ్రామ శివారులో గత వారం రోజులుగా చిరుత సంచారం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేస్తున్నారు. చిరుత సంచరించడంతో పొలాలకు వెళ్ళాలంటే భయాందోళనలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే పొలాలకు వెళ్లడం లేదన్నారు. చాలా మంది రైతులు ఎద్దులు, ఆవులు, గేదెలను పొలాల దగ్గర ఉన్న గుడిసెల్లోన్నే ఉంచుతారన్నారు. ఈ సమయంలో ఏం జరుగుతుందోనని ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని పొలాలకు వెళ్లాల్సి న పరిస్థితి ఉందన్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించిన స్పందించడం లేదన్నారు. ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా మద్దెల భీడు గ్రామ సమీపంలో సంచరిస్తున్న చిరుత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు, యువకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## పీఎం శ్రీ నిధుల సద్వినియోగంతో పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పీఎం శ్రీ పథకం కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనుల ప్రారంభానికి విడుదలైన మొదటి విడత నిధులపై జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితా రానా నిర్వహించగా నాగర్‌కర్నూల్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ పీఎం శ్రీ పథకం కింద అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత నిధులను త్వరగా వినియోగించి, ఎంపికైన పాఠశాలల్లో వారం రోజుల వ్యవధిలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన మౌళిక వసతులు, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, క్రీడా సౌకర్యాలు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల అభివృద్ధికి పీఎం శ్రీ నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పీఎం శ్రీ పథకానికి ఎంపికైన 27 పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, గార్డెనింగ్, విద్యుత్ శక్తి సౌకర్యం, లైబ్రరీ, పరిసరాల పరిశుభ్రత, అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరిత గతినపూర్తి చేయాలని, వీటి అభివృద్ధికి మొత్తం రూ.3.89 కోట్లు విడుదల అయ్యాయని, ఈ నిధులను పూర్తిగా వినియోగించి, పాఠశాలల్లో అన్ని రకాల మౌళిక వసతులను అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులకు సూచించారు. పీఎం శ్రీ పథకం ద్వారా స్మార్ట్ క్లాస్‌లు, ల్యాబ్‌లు, గ్రీన్ ఎనర్జీ ఆధారిత విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, మంచినీటి వసతులు తదితర అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎంపికైన 27 పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి నిధులను వెంటనే ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని డీఈఓ రమేష్ కుమార్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రెండో విడత నిధులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సమర్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో మొదటి విడతలో 27 పాఠశాలలు ఎంపిక కాబడిన వాటి అభివృద్ధి పనుల వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించాలని, పీఎం శ్రీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల ఆలస్యం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ గణాంక అధికారి మధుసూదన్ రెడ్డి, సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసన్ని ఇస్తుంది : ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లాసన్ని ఇస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట పట్టణ కేంద్రంలో కొత్తకోట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో పెద్దలకు యువకులకు క్రీడాలతోపాటు వినోదాలు అవసరమని చెప్పారు. అనంతరం రాఘవేంద్ర స్వామి దేవాలయంలో ఉడిపి పీఠాధిపతి స్వామి వారు విచ్చేసిన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని పట్టణంలోని బిపిఆర్ గార్డెన్స్ లో టీచర్ భక్తరాజ్ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, సీడీసీ చైర్మన్ గొల్లబాబు, జిల్లా కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయోజ్, నిర్వాహకులు శేఖర్ గౌడ్, ప్రవీణ్, గుంత శివ, మిషేక్, వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, చర్లపల్లి శేఖర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల బారి నుండి జింకను కాపాడిన రైతులు

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మల్కిమియాన్ పల్లి గ్రామ శివారు పిల్లి వాగు సమీపంలో శుక్రవారం వీధి కుక్కలు ఓ జింకను తరుముతో వచ్చాయి అటుగా వచ్చిన అదే గ్రామానికి చెందిన హసనాపురం సత్తిరెడ్డి, బుగ్గని బాలరాజు వీధి కుక్కల బారి నుండి జింకను కాపాడారు. జింకకు మెడ భాగంలో తీవ్ర గాయాలతో రక్తం కారుతుండడంతో రక్తం కారకుండా టవల్ చుట్టారు. సమాచారాన్ని మండల ఫారెస్ట్ అధికారులకు చెప్పడంతో ఫారెస్ట్ సిబ్బంది వారి వాహనంలో జింకను మండల కేంద్రానికి తరలించారు. పశు వైద్యాధికారి చేత జింకకు చికిత్సలు నిర్వహించి జంగమయ్యపల్లి ఫారెస్ట్ ప్రాంతంలో వదిలిపెడతామని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భాస్కరాచారి, బీట్‌ఆఫీసర్ నాగేంద్రం తెలిపారు. వీధి కుక్కల భారీ నుండి జింకను కాపాడిన రైతులు సత్తిరెడ్డి బాలరాజును గ్రామస్తులు అభినందించారు.



జింకను అటవీ శాఖ అధికారులకు అందజేస్తున్న దృశ్యం

## సైబర్ భద్రతపై వర్క్ షాప్

### ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహణ

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అటానమస్ కళాశాలలో గురువారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం సైబర్ భద్రతపై వన్డే ఆన్లైన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాన్ ఇండియా స్థాయిలో భారీ సైబర్ సెక్యూరిటీ అవగాహన ప్రచార నేపథ్యంలో భాగంగా దేశవ్యాప్తంగా బాధ్యతయుతమైన ఇంటర్నెట్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూనే సురక్షితమైన ఆన్లైన్ పద్ధతులు, సైబర్ భద్రత కీలక సైబర్ బెదిరింపులు మరియు సమర్థవంతమైన ఉపశమన వ్యూహాలపై ఇంటర్నెట్ వినియోగదారులకు విస్తృత అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న కొద్ది సైబర్ మోసాలు అంతకంతకు పెరుగుతున్నాయని , అమాయకుల్ని టార్గెట్ చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారని తెలిపారు. ఏమాత్రం అనుమానం రాకుండా ఖాతాల్లో డబ్బును ఊహకందని రీతిలో లూటీ చేస్తున్నారని, ఈ నేపథ్యంలో సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచి మోసాల బారిన పడకుండా తెలంగాణ ప్రభుత్వం సైబర్ భద్రతపై ముఖ్యంగా ఉద్యోగస్తుల్లో అవగాహన పెంచడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా. పద్మ అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్, డా.శ్రీదేవి, ప్రకాష్, డాక్టర్ లక్ష్మినరసింహారావు పాల్గొన్నారు.

## చేనేత పొదుపు నిధి పథకంలో

## చెరెందుకు 15 వరకు గడువు పొడగింపు

**గద్వాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** తెలంగాణ చేనేత అభయ హస్త పథకం లో భాగంగా జిల్లాలోని చేనేత, మరమగ్గం, అనుబంధ కార్మికులు తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి) పథకంలో చేరుటకు ఈ నెల 15 చివరి తేదీ అని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత వృత్తిలో ఉన్న కార్మికులకు పొదుపు, సాంఘిక భద్రత కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేనేత కార్మికులు సహకార రంగము/ సహకారేతర రంగంలో ఉన్నటువంటి వారికి, దాన్ని సంబంధిత రంగుల అద్దకం/ డిజైనింగ్/ వార్పింగ్ /వైండింగ్, సైజింగ్ చేసే అందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. 18 సంవత్సరాలు పైబడి కనీసం 50 శాతం చేనేత వృత్తి నుండి ఆదాయం పొందే కార్మికులకు ఈ పథకం వర్తిస్తుందని అన్నారు. ఇందులో భాగంగా ప్రతి కార్మికుడు ప్రతినెల 15వ తేదీ లోపల తను సంపాదించిన వేతనం నుండి 8 శాతం ఆర్‌డి-1 కు జమ చేసుకోవాలి. తర్వాత ప్రభుత్వం నుండి వచ్చే 16 శాతం వేతనాలను సంబంధిత ఆర్‌డి-2 ఖాతాకు జమ చేయనున్నట్లు, ఎట్టి పరిస్థితులలో ఆర్‌డి డబ్బును 24 నెలల లోపు తీసుకొనుటకు అనుమతింపబడదని తెలిపారు. ఈ పథకంకు అర్హత కలిగిన చేనేత కళాకారులు, అనుబంధ కార్మికులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 15 లోగా సహాయ సంచాలకులు చేనేత, జౌళి శాఖ కార్యాలయమునకు సమర్పించాలని తెలిపారు.

## అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంచుకోవాలి

**బిజినేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మొక్కజొన్న పంట సాగు చేసే రైతన్నలు అధిక దిగుబడిని ఇచ్చే రకాలను ఎంచుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త డా. ఎం. సుజాత అన్నారు. ప్రొ॥ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రామంలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. శాస్త్రవేత్త ఎం. సుజాత మాట్లాడుతూ రైతన్నలు శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక లాభాలు పొందుతారన్నారు. ప్రతి రైతు పంట మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. కెవికె కోఆర్డినేటర్ డా. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న పంట మంచి దిగుబడి పెంచుకునే అవకాశం ఉన్న పంట. మొక్కజొన్న పంటలో ఎరువుల యాజమాన్యం చాలా ముఖ్యమైనది అన్నారు. పంట మార్పిడి పద్ధతులను పాటించాలని అప్పుడే రైతన్న దిగుబడిని పొందే అవకాశం ఉందన్నారు. మొక్కజొన్న పరిశోధన శాస్త్రవేత్తలు డా. మల్లయ్య, డా. వాణిశ్రీ తెగుళ్ల పురుగులు యాజమాన్యం పంట దిగుబడి పెంచుకునే అంశాలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డా. సమంతా పరమేశ్వరి కెవికె శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త

## జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కేటాయించాలి

### కలెక్టర్‌కు బీసీ సేన అధ్యక్షుడు కృష్ణయాదవ్ వినతి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** జనాభా దామాషా నిష్పత్తిలో బిసిలకు బడ్జెట్ కేటాయిం చాలని విజేంద్రబోయికు బిసి జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ఆధ్వ ర్యంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మహ బూబ్‌నగర్ కలెక్టరేటులో వినతిపత్రం అందజేశారు. మార్చి నెలలో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు జనాభా దామాషా నిష్పత్తిన బడ్జెట్‌లో రూ.50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. బిసి ఉప ప్రణాళిక ఏర్పాటు చేసి ప్రతి వార్షిక బడ్జెట్ లో అదనంగా రూ. 20వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం గత సంవత్సరం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో రూ. 20వేల కోట్ల బడ్జెట్ కేటాయించ కుండ విస్మరించిందని, ఈ వార్షిక బడ్జెట్‌లో వాటితో కలిపి బిసిలకు రూ.40వేల కోట్ల బడ్జెట్ కేటాయించి బిసి సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగుల కు, చేతివృత్తిదారులకు ఉపాధి కల్పించాలని అలాగే స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాకే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సేన కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, నాయకులు గొడుగు నర్సిములు, జిల్లా నాయకులు గోపాల్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కృష్ణ యాదవ్

## మహాశివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**గద్వాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో మహ శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మినారాయణ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు మహశివరాత్రి మహోత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహశివరాత్రి మహోత్సవాలను ప్రతి ఏడాది మాదిరిగానే ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అందరూ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయం ఈ.ఓ. తహశీల్దార్, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోని పనులను చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రసాదం పంపిణీ కోసం ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, అంగ వైకల్యం ఉన్న భక్తులకు ప్రత్యేక సేవలు అందించాలని, క్యూలైన్లను క్రమంగా నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిపి సందర్శనల సమయంలో ప్రత్యేకంగా ప్రోటోకాల్ నిర్వహణకు సంబంధించిన చర్యలు చేపట్టాలని తహశీల్దార్ కు సూచించారు. ప్రోటోకాల్ ప్రకారంగా భద్రత, ఇతర సౌకర్యాలను పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్, త్రాగునీరు, లైటింగ్ వాటిపై దృష్టి పెట్టాలని అన్నారు. పుష్కరఘాట్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణకు, భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని పోలీసు శాఖకు సూచించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పట్టణంలో 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆలయ పరిసరాల్లో 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య అధికారినికి ఆదేశించారు. అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉంచాలని, ప్రధాన రహదారుల వెంట ప్రత్యేక ఆర్టీసీ బస్సులు అదనంగా నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ రహదారులకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. పర్యాటకులకు సక్రమమైన గదులు ఉండేలా ఏర్పాట్లు చేయాలని పర్యాటక శాఖ అధికారులను సూచించారు. పుష్కర ఘాట్‌వద్ద ప్రమాదాలు జరగకుండా గజఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పార్కింగ్, బార్కెడింగ్, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాల న్నారు. మహ శివరాత్రి మహోత్సవాలను భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా, అత్యుత్తమ నిర్వహణతో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమర్థంగా పనిచే యాలని ఆదేశిం చారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, ఈ.ఓ పురేందర్, తహశీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్ రావు, సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ

## బహిరంగ సభను విజయవంతం చేయాలి

### - సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ సగర పిలుపు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న సగర శంఖారావంఖి బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర పిలుపునిచ్చారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తి, వడ్డేమాన్, సల్కరిపేట, షాయిన్‌పల్లి, గంగారం, పోలపల్లి, బిజినపల్లి, ఖానాపూర్ తదితర గ్రామాలలో జిల్లా అధ్యక్షులు పోతులపల్లి గట్టు శ్రీనివాస్ సగర ఆధ్వర్యంలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని, సగరులను చైతన్యం పరుస్తూ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఆది నుంచి నేటి వరకు సగర జాతి రాజకీయంగా ఆర్థికంగా వెనుకకు నెట్టివేయబడిందని, భవిష్యత్తులో ముందడుగు వేసేందుకు సగరులు చైతన్యవంతులై సంఘటితమై బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని శేఖర్ సగర పిలుపునిచ్చారు. సగరుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. సన్నాహక సమావేశాలకు వందలాదిమంది సగరులు హాజరై సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఆర్.బి.ఆంజనేయులు సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్చార్జ్ మోడల్ ఆంజనేయులు సగర, రాష్ట్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి సగర, నాగర్‌కర్నూల్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లం రాముడు సగర, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి బంగారి ఆంజనేయులు సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చీర్ల విష్ణు సగర, నాగర్‌కర్నూల్ నియోజకవర్గం ఇన్‌చార్జి చంద్ర నారాయణ సగర, జిల్లా ఉపాధ్యక్షులు కొంగుల శ్రీనివాస్ సగర, గట్టయ్య సగర, ఆంజనేయులు సగర, శ్రీనివాస్ సగర, బిజినేపల్లి మండల అధ్యక్షులు రాజేష్ సగర, స్వామి సగర, పాండు సగర, గౌని రామచందర్ సగర, యుగంధర్ సగర తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## నిరుద్యోగులకు డీట్ యాప్ ఉపయోగంగా ఉంటది

### జిల్లా పరిశ్రమల మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్

**గద్వాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనలో నిరుద్యోగులకు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్ యాప్) ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి.రామలింగేశ్వర గౌడ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ జిల్లాకమిటీ డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు నిరంతర ఉపాధి అవకాశాలను కల్పించేందుకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. ఈ వినూత్న ఎఐ-ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్ యువత నైపుణ్యాలను గుర్తించి, అర్హతలకు అనుగుణంగా ప్రైవేట్ రంగ ఉద్యోగాలను సూచించడం ద్వారా ఉద్యోగార్థులు పరిశ్రమలకు కీలక వారధిగా పనిచేస్తుందని తెలిపారు. డీట్ ద్వారా ఉద్యోగార్థులకు రెజ్యూమె తయారీ మార్గదర్శనం, స్థానం ఆధారంగా ఉద్యోగ నోటిఫికేషన్లు, ఇంటర్న్‌షిప్ అప్రెంటిస్‌షిప్ అవకాశాల హైలైట్, జాబ్ మేళాల నిర్వహణ వంటి సేవలు అందించబడుతుందని అన్నారు. వెబ్‌సైట్, ఆండ్రాయిడ్, ఐఓఎస్ అప్లికేషన్‌ల ద్వారా ఎన్‌రోల్‌మెంట్, జాబ్ పోస్టింగ్‌లు, జాబ్ అలర్ట్‌లు, హెచ్‌ఆర్‌లతో చాట్‌లు, ఇంటర్వ్యూలు వంటి ఫీచర్లను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఐ.టి.ఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీట్‌లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉపాధి పొందే అవకాశాలు మెరుగుఅవుతాయని అన్నారు. జిల్లాలో ఉన్న ఐటిఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాసైన విద్యార్థుల వివరాలను డీట్‌లో నమోదయ్యేలా చూడాలని అన్నారు. ఈ యాప్ గురించి విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. డీట్ యాప్‌లో కళాశాల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని అన్నారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి.రామ్మోహన్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.వి.వి. సత్యనారాయణ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ డా. ప్రియాంక, అసిస్టెంట్ కమిషనర్ అఫ్ లేబర్ పీ.జె. మహేష్ కుమార్, అడిషనల్ డీఆర్‌డీఓ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్

## అమర జవాన్ల త్యాగం మరువలేనిది

**బిజినపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పుల్వామాలో సైనికులపై జరిగిన దాడిలో మృతి చెందిన అమర వీరులకు శుక్రవారం పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో ఘన నివాళ్లు అర్పించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో 2019 సంవత్సరంలో జరిగిన పుల్వామా దాడులలో వీర మరణం పొందిన జవాన్లకు నివాళులర్పించడం జరిగింది. అమర జవాన్లను స్మరిస్తూ ఐదు నిమిషాలు మౌనం పాటించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యార్థి నాయకులు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్ల త్యాగం ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ప్రేమికుల దినోత్సవం లాంటి విదేశీ సంస్కృతిని విడనాడాలని అన్నారు. విదేశీ సంస్కృతి వీడి, భారతీయ యువత మన సంస్కృతిని ఆచరించాలని వాలెంటైన్స్ డే పేరిట అనేక మంది అమ్మాయిలు బలవన్మరణాలకు, అత్యాచారాలకు గురవుతున్నారని , ఈరోజు దేశమంతా మనం రక్షణగా నిలుస్తూ పాకిస్తాన్ ఉగ్ర వాదుల చేసిన పిరికి చర్యలకు బలైన అమర వీరులు సీఆర్పీఎఫ్ జవాన్‌లను స్మరించుకుని వారి త్యాగాలను ప్రతి ఒక్కరం స్మరిస్తూ ఎలాంటి అసంఘటిత కార్యక్రమాలకు దూరంగా ఉండి దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో శివాజీ, జయప్రకాష్, భాను ప్రకాష్, సంఘ మహేష్, ఆంజనేయులు, జీవన్ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ గౌడ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాములు పాల్గొన్నారు.



అమర జవాన్లను స్మరిస్తూ మౌనం పాటిస్తున్న విద్యార్థులు

### నషా ముక్త్ భారత్ గురించి పాఠశాల విద్యార్థులకు

## మత్తు దాని దుష్పరిణామాల గురించి అవగాహన

**ధన్వాడ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో గల జెడ్పిహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో నేడు మిషన్ పరివర్తన గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ డిస్టిక్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసు నారాయణపేట వారి ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ గురించి పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం అనర్థాల మీద అవగాహన కలిగించారు. మత్తు పదార్థాలు దాని దుష్పరిణామాలను కమ్యూనిటీ ఎడ్యుకేటర్ లక్ష్మికాంత్ వివరించారు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు చిన్ననాటి నుండే వేసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చక్కని క్రమశిక్షణతో చదువుకోవాలని వివరించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ చారి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని గొప్ప వాళ్లుగా పేరుపొందిన రోజు తమకే కాకుండా పాఠశాలకు మంచి పేరును అలాగే తమ తల్లిదండ్రులకు కూడా మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మికాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహచారి, ఫరీదా సుల్తానా, సుభాషిని, వెంకటమ్మ, సౌభాగ్య లక్ష్మి, సురేష్ బాబు, వెంకటేశ్, రామకృష్ణ, వెంకటేష్, అశోక్ శ్రీనివాస్, రవి మొదలగువారు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## కార్మికులకు వేతనాలు చెల్లించాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

**మక్తల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మక్తల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత ఐదు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించి వారిని ఆదుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రి వద్ద మెడికల్ ఆఫీసర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులతో కలిసి అందజేశారు. కార్మికులకు రూ.26 వేల కనీస వేతనాన్ని అందించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే యూనిఫామ్, గ్లౌజులను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు మధు, భీమ్, బాలరాజు, పవన్, నరేష్, మహబూబ్, జములమ్మ, సంధ్య, లక్ష్మి, నర్మద, తిప్పమ్మ, వి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

**మక్తల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పాఠశాలలు, కళాశాలల్లో బాలికలు, అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధిస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని షీ టీం పోలీసు అధికారి బాలరాజు, భరోసా సెంటర్ అధికారిణి ప్రమీల అన్నారు. శుక్రవారం మక్తల్ మండలంలోని గుడిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు చట్టాలు, షీ టీం పనితీరు, భరోసా సెంటర్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా సంస్థల్లో కానీ, బాహ్య ప్రపంచంలో కానీ అమ్మాయిలు వేధింపులకు గురైతే షీ టీం పోలీసులకు గాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది చెన్నయ్య, దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి.!

**బిజినేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన ఖానాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు తలారి చెన్నమ్మ (50) సుల్తాన్ భార్యాభర్తలు. పంట పొలంలో వేసిన మొక్కజొన్న పంటకు సాగునీరు అందించేందుకు వెళ్లిన సుల్తాన్ ఇంటికి రాగానే అపస్మారక స్థితిలో ఉన్న చెన్నమ్మను చూసి ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ మృతి చెందిన చెన్నమ్మ ఒంటిపై గాయాలు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని ఎస్ఐ శ్రీనివాస్ విచారణ చేపట్టినట్లు వివరించారు.

## ఎమ్మెల్సీ తీన్మార్

## మల్లన్నను కలిసిన బీసీ సంఘం నేతలు

**బిజినేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బిజినపల్లి బీసీ సంఘం నాయకులు దాసర్ల వెంకటస్వామి, సత్యశీల సాగర్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. తీన్మార్ మల్లన్నను కలిసిన నేతలతో బీసీ కులాలను ఐక్యం చేసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేసేలా చైతన్యం తీసుకురావాలని సూచించినట్లు వివరించారు. త్వరలోనే ఈ ప్రాంతంలో వరంగల్ తరహాలో బీసీ రాజకీయయుద్ధభేరి సమావేశం నిర్వహించ తలపెట్టినట్లు చెప్పారు.



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో బీసీ సంఘం నేతలు

## కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే



పంట పొలంలో కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే

**బిజినేపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా బోయపూర్ గ్రామంలోక్రాప్ డిజిటల్ సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ శివారులో రైతుల పొలాల్లో వేసిన పంటలను గుర్తింపునకు ఏఈఓ కె.శారద శుక్రవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల పొలాలకు వెళ్లి అక్కడ వేసిన పంటలను ఫోటో తీసి ఆన్లైన్లో నమోదు చేశారు. పంటల నమోదు ప్రక్రియ డిజిటల్ సర్వే రూపంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సర్వే నెంబర్, ప్రతి సర్వే సబ్ డివిజన్ నెంబర్ తిరిగి రైతు యాసంగిలో పండించిన ప్రతి పంటని ఫోటో తీసి ఆ పంట వివరాలని యాప్‌లో అప్లోడ్ చేసి డిజిటల్ క్రాప్ సర్వే చేయడం జరుగుతుంది. దీని వలన రైతులు వారు పండించిన పంటలని ప్రభుత్వానికి అమ్మడానికి వీలుగా ఉంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలకు ఈ సర్వే ఉపయోగపడుతుంది వివరించారు.

## నూతన ఏపీయంగా వెంకటేష్ యాదవ్

**పాన్‌గల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** పానగల్ మండల మహిళా సమాఖ్య ఏపీయంగా వెంకటేష్ యాదవ్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సక్రూ నాయక్ ఆత్మకూరు కు బదిలీపై వెళ్లగా ఆత్మకూరులో పనిచేస్తున్న వెంకటేష్ పాన్‌గల్ కు బదిలీపై వచ్చారు. దీంతో నేడు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం కల్పించే సంక్షే మ పథకాలను సద్వినియోగంచేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని తెలిపారు.



పదవి బాధ్యతలు స్వీకరించిన ఏపీయం వెంకటేష్ యాదవ్

## పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలకు పంపాలి

■చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మణ్‌రావు



మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మణ్‌రావు

**లింగాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి చదువుకునే విధంగా ప్రోత్సాహించాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మణ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంబట్ పల్లి గ్రామంలో క్రైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజ న్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంబట్‌పల్లిలో చదువుతూ మధ్యలో పాఠశాల మానేసిన పిల్లలను కోనేరు సంస్థ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు.అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్‌లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ 18 సంవత్స రాలలోపు పిల్లలు పాఠశాల లలో ఉండాలని పనుల్లో ఉండకూడదని సూచించారు. పిల్లలతో పనులు చేయిస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపి ఉన్నత శిఖరాలకు ఎదగడానికి కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బక్కన్న,చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మల్లేష్,చైల్డ్ హెల్ప్ లైన్ ప్రమీల,కోనేరు సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేర్లు తొలగింపునకు దరఖాస్తు చేసుకోండి

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రేషన్ కార్డులలో పేర్లు తొలగింపుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎల్లయ్య కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీలో భాగంగా మండలంలోని మహిళలు వివాహం చేసుకొని వెళ్లిన వారుతమ తల్లిదండ్రుల రేషన్ కార్డులో పేరు ఉన్నట్లయితే వాటిని తొలగించుకునే అవకాశం ఉందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం పొందిన వ్యక్తులు తమ తల్లిదండ్రులను తెల్లరేషన్ కార్డులో పేరు ఉన్నట్లయితే వెంటనే తొలగించు కునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రేషన్ కార్డులో పేర్లు తొలగించుకోవాలని లేనిపక్షంలో వారిపై సీసీ యాక్ట్ 55 కింద రేషన్ బియ్యం రికవరీ చేస్తూనే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండల ప్రజలు రేషన్ కార్డులో పేర్లతో తొలగింపునకు మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా పెళ్లయిన మహిళలు, తమ పిల్లల పేర్లను చేర్చుకునేందుకు మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న జాగృతి నాయకురాలు మిర్యాల పావనికి పరామర్శ



పావనిని పరామర్శిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** హైదరాబాదులోని అల్వాన్స్‌గూడలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్ట ణానికి చెందిన జాగృతి నాయకు రాలు మిర్యాల పావని అనారో గ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని తెలంగాణ జాగృతి వ్యవ స్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డిలు వారి ఇంటికి వెళ్ళి పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చి త్వరగా కోలుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ కవిత భావోద్వేగనికి గురై కళ్ళు చెమర్చారు. జాగృతి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే పావని ఆమె త్వరగా కోలుకోవాలని కోరుకుందా మన్నారు. ఆమెకు అందుతున్న వైద్యంపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నరు. వారి వెంట జాగృతి నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి తండాలో సంత్ సేవాలాల్ ఉత్సవాలను నిర్వహించాలి




సమావేశంలో మాట్లాడుతున్న బాల్యా నాయక్

**పాన్‌గల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మండలంలోని ప్రతి గిరిజన తండాల్లో ఈ నెల 15న సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యా నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని తెల్ల రాళ్ళపల్లి తండాలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గిరిజనుల ఆరాధ్య దైవంసంతు సేవలల్ జయంతిని ఈ నెల15న ప్రతి తండాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## ఫిట్నెస్ లేని ట్రాక్టర్ల పై చర్యలు తప్పవు

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం మోపెందుకు జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని అందులో భాగంగానే పెబ్బేరు మండలం శాఖాపూర్ ఇసుక రిచ్‌ను శుక్రవారం జిల్లా రవాణాశాఖ అధికారి మానస సందర్శించారు. తనిఖీ లలో భాగంగా లైసెన్సులు ఇన్సూరెన్స్ పత్రాలు లేని ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు వ్యవసాయ సాగుకు ఉపయోగపడేందుకు వినియోగించే ట్రాక్టర్లను కమర్షియల్‌గా వినియోగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఫిట్నెస్ లేని, డ్రైవింగ్ లైసెన్స్‌లేని, పర్మిట్ లేని ఇన్సూరెన్స్ లేని వెహికల్స్‌ను నడపద్దని సూచిం చారు. ఆమె చేసిన తనిఖీలలో 7ట్రాక్టర్ల పై కేసులు నమోదు చేసామని వెల్లడించారు.

## పద్మశ్రీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం



ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** హైదరాబాదులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను శుక్రవారం బిసి సబ్ ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సామా జిక ఉద్యమాలు నిర్మించి నడిపించి, వర్గీకరణ అంశాన్ని 30 ఏళ్లుగా కాపాడుతూ చివరికి లక్ష్యాన్ని చేరుకోవడంలో సఫలీకృతం కావడం, అదేవిధంగా భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడంతో మందకృష్ణ మాదిగను శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ తాలూకా అధ్యక్షులు మేకల రాజేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ బీసీలు చేసే పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, రాబోయే రోజులలో కలిసి ఉద్యమాలు చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సబ్ ప్లాన్ సాధన కమిటీ ముఖ్య నాయకులు కానుగుల జంగయ్య, ఎమ్మార్పీఎస్ వీరాస్వామి మాదిగ, కిరణ్, చిన్న, జగన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జడ్జిపై దాడికి నిరసనగా పేట కోర్టులో వీధుల బహిష్కరణ



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా మహిళా జడ్జి పై ముద్దాయి చెప్పు విసిరి దాడి చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ శుక్రవారం నారాయణ పేట జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధుల ను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ సభ్యులు మాట్లాడుతు ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. దాంతో నేడు ఏకంగా జడ్జి పైనే దాడికి కారణం అయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయవాదులు, జడ్జీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందునామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, న్యాయవాదులు సీతారామరావు, లక్ష్మిపతి, ఆకుల బాలప్ప, భీంరెడ్డి, విజయ్ భాస్కర్, కుర్మన్నగౌడ్, కాళేశ్వర్, ప్రవీణ్‌నామా జీ.వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి

■వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



పెబ్బేర్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు గదుల కోసం భూమి పూజ



**పెబ్బేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలో శుక్రవారం రోజు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో 22 లక్షలతో అదనపు గదుల కోసం భూమి పూజ, దర్గా సిసి బెడ్ నిర్మాణం కోసం భూమి పూజ, తోమాలపల్లి గ్రామంలో సిసి రోడ్డు, డ్రైనేజీ, రాంపురంలో బీటీ రోడ్డు కోసం శంకుస్థాపన ,వైశాఖపూర్ గ్రామంలో ప్రాథమిక హెల్త్ సబ్ సెంటర్ ప్రహరీ గోడ నిర్మాణం, గ్రంథాలయం, సిసి రోడ్డు భూమి పూజ చేశారు. రాంపురం, కొత్తూరు, తిప్పాయిపల్లి, యాపర్ల, గుమ్మడం, నాసంపల్లి గ్రామాలలో డ్రైనేజీ, సిసి రోడ్ల కోసం భూమి పూజ నిర్వహించారు. డాక్టర్ రాకేష్ రెడ్డి, వారి బృందం, ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ రెడ్డి వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు గంధం రంజిత్ కుమార్, గోవింద నాయుడు, భాను ప్రకాష్ రెడ్డి, దయాకర్ రెడ్డి, బి రామచంద్ర రెడ్డి, యుగంధర్ రెడ్డి, శ్రీహరి రాజు, పూరు రమణ, బిరం రాజశేఖర్, రాముల నాయుడు, టి రంగన్న, సత్యనారాయణ రెడ్డి, కురుమూర్తి ,మున్సిపల్ కమిషనర్ ఆశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కృష్ణ, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** గ్రామీణ మహిళలకు అవగాహన కల్పించి,మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసే కార్యక్రమాన్ని మండలంలోని చేస్తున్నట్లు సెర్ప్ సంస్థాగత డైరెక్టర్ నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలంపల్లి, కుసుమూర్తి, గురజాల గ్రామంలో మహిళా సంఘాల ఏర్పాటు,ప్రోత్సాహం, బలోపేతం చేయడానికి 8 రోజులు ఆయా గ్రామాలకు వెళ్లి అవగాహన,శిక్షణ కార్యక్రమాలను నిర్వ హిస్తున్నట్లు ఆయన అన్నారు.పాలమూరు మహా సమాఖ్య నుండి మహిళా సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వడానికి వచ్చిన రిసోర్స్ పర్సన్‌లతో ఆయా గ్రామాల్లో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలకు అవగాహన కల్పించి గ్రామంలో సంఘంలో లేని మహిళలందరూ సంఘాలుగా ఏర్పాటు కావాలని అదేవిధంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రవీందర్, అడిషనల్ డిఆర్డిఓ అంజయ్య, డిసిఎంఎస్ కరుణాకర్, ఆనందం, ఇన్చార్జి ఎపిఎం బసవరాజు, మహేంద్ర జిల్లా సమైక్య అధ్యక్షులు చంద్రకళ, సిఆర్పిలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి



వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

**నారాయణపేట టౌన్,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఏఎస్పీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నారాయ ణపేట జిల్లాకేంద్రంలో సావర్కర్ చౌరస్తాలో నారాయణ పేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్పి మాట్లా డుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ఉపయోగించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని, కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిమ్స్ ఉండరాదు అని సూచించారు. వాహనాలు నడిపే సమ యంలో వాహనానికి సంబంధించిన ఆర్‌సి డ్రైవింగ్, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. త్రిబుల్ రైడింగ్‌లో వాహనాలు నడుపరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మైనర్లు వాహనాలు నడుపరాదని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రజలను విద్యార్థులను ఎక్కించుకోరాదని, రోడ్డు భద్రతా నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎఎస్పి తెలిపారు.

## చేనేత నేత పొదుపు పథకంలో అవకతవకలు జరగకుండా చూడాలి

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** చేనేత నేత పొదుపు పథకంలో అవకతవకలు జరగకుండా చూడాలని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ టౌన్ కార్యదర్శి కెంచె నారాయణ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఓ ప్రకటనలో మాట్లా డుతూ దేశంలో రైతు సంఘం తర్వాత చేనేత వర్గమే పెద్దది కానీ ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో దేశంలో, రాష్ట్రంలో చేనేత వర్గానికి కార్మికులకు ఎలాంటి ఉపాధి లేదు అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2017లో జీవో ట్యాకింగ్ నేత పొదుపు నేతనలకు ప్రవేశ ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఈ పథకము 2024లో సెప్టెంబర్‌లో ముగింపు అయ్యిందిఅన్నారు. ప్రస్తు తం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఫిబ్రవరి 15లోపల చేనేత కార్మికుడు జీవో ట్యాగింగ్ నంబర్ ఉన్న ప్రతి కార్మికుడు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. గత ప్రభుత్వంలో ప్రతి కార్మికుని కుటుంబంలో ఈ పథకం ముగ్గురికి వర్తించేది. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కుటుం బంలో ఇద్దరికే ఈ పథకం చెందే విధంగా చేయడం జరిగిం ది. పాత పద్ధతి లాగా కుటుంబంలో ముగ్గురికి ఈ పథకం వర్తించే రకంగాచూడాలని అన్నారు. నారాయణపేట జిల్లాలో ఉన్న కార్మికులకు జీయో ట్యాగింగ్ కలిగి ఉన్నా కార్మికులు కాకుండా మాస్టర్ వివర్స్ సంబంధించిన కుటుంబ సభ్యు లను ఈ పొదుపు సంఘంలో చేరుస్తున్నారని కొంతమంది కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంత జౌళి శాఖ దాసరి బాబు అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతి కార్మికునికి న్యాయం జరిగే విధంగా చూడాలనీ ప్రతి కార్మికుని అప్లికేషన్ తన కార్యాలయంలోఅందించాలని పేపర్ ప్రకటనలో ప్రకటించి నారని అన్నారు. జీవో టాగింగ్ సంబంధించిన కార్మికుల అప్లికేషన్లు మధ్యవర్తులుగా వ్యవహరించి ప్రతి కార్మికుని నుండి రూ. 200 నుంచి రూ.300 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని ఇది సరైనది కాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఏడి దీనిపై దృష్టి పెట్టి అవకతవకలు జరగకుండా ప్రతి కార్మికుడికి న్యాయం జరిగే విధంగా చూడాలని వారు డిమాండ్ చేశారు.

## చేనేత కార్మిక సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో వినతి

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సహకార భారతి నారాయణపేట జిల్లా వారి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన చేనేత కార్మికులను పట్టించుకునే వారు లేరన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ. 2 లక్షల వ్యక్తిగత సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. చేనేత పరిశ్రమను కాపాడు కునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని ప్రత్యేక పథకాలను ప్రభుత్వం ప్రకటించాలన్నారు.వయస్సు నిమిత్తము లేకుండా ప్రతి చేనేత కార్మికులకి నెలకు రూ. 5000 జీవన భృతి అందించాలన్నారు. అదేవిధంగా చేనేత కార్మికునికి ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. వినతి పత్రం అందిం చిన వారిలో చేనేత కార్మికులు కంచె శ్రీనివాస్, ఉదయ్ భాను, బసుదే కిష్టప్ప, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 26శివరాత్రి నుండి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నా యి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో దేవాలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డిఆధ్వర్యంలో అర్చకులు కలిసి ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి ఆశీర్వచనం అందించి బ్రహ్మో త్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, దేవాల య ఈఓ ప్రసాద్, వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, ఆలయ కమిటీ సభ్యులు మల్లేష్ ముదిరాజ్, అంజయ్య, దేవాలయ అర్చకులుశివప్రసాద్‌శర్మ,సంతోష్‌శర్మ తదితరులు ఉన్నారు.

## ఘనంగా షబ్-బే-రాత్ వేడుకలు



మజీద్‌లో ధార్మిక ఉపన్యాసం చేస్తున్న మొహ్మద్ సాధిక్

**భూత్పూర్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** ముస్లింల పవిత్ర పెద్దల పండుగషబ్-బే-రాత్ శుక్రవారం ఘనంగా నిర్వ హించారు.గురువారం రాత్రి నమాజులతో జాగరణలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మరుసటి రోజు శుక్రవారం మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.మత పెద్దలు మజీద్ లలో పవిత్ర గ్రంథం ఖురాన్‌ను పటించారు. హైదరా బాద్‌లోని జామియా నిజామియా నుంచి హజ్రత్ ఆలం మౌలానా ఆహ్మద్ అస్లం నక్షబంది సాహెబ్‌లు జామే మజీద్‌లో ధార్మిక ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మజీదుల కమిటీల అధ్యక్షుడు మొహ్మద్ సాధిక్‌తో పాటు కమిటీ సభ్యులు మొహ్మద్ సాధిక్,మొహ్మద్ ఖదీర్, మొహ్మద్ జహంగీర్,మొహ్మద్ హాజి,మొహ్మద్ ఆరీఫ్ హుస్సేన్‌తో పాటు ఇమాంలు సయ్యద్ షరీఫ్,మహ్మద్ సిరా జుద్దీన్,మౌజాన్,అమీరొద్దిన్,రషీద్,అల్హాజ్ మొహ్మద్, అల్హాజ్ సాధిక్,సాబేర్,అప్సర్,షర్ఫొద్దిన్, ఖాసిం, మొహ్మద్ షేక్ యాసిన్,మసూద్, మసూద్, అలీం,సర్వర్,అక్బర్, అసద్‌తదితరమతపెద్దలు,ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## నేడు నీటి సరఫరా బంద్

**గద్వాల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా ప్రజలకు తెలియజేయునదిఏమనగా,రేవులపల్లి, ధరూర్ మండలంలో నీటి శుద్ధి కర్మాగారం శుభ్రపరచడం జరుగుతుంది. కావున శనివారం 15వ తేదీ నాడు నీటి సరఫరా ఉండదని, ఆ తర్వాత యధావిధిగానీటి సరఫరా చేయడం జరుగుతుందని మిషన్ భగీరథగ్రిడ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవి చంద్ర కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఓటీఎస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ధన్వాడ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడ సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు వన్ టైం సెటిల్మెంట్ సద్విని యోగం చేసుకోవాలని ధన్వాడ సింగల్ విండో ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి సూచించారు. శుక్రవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లా డుతూ ఈనెల 15లోపు రైతులు ఓటీఎస్ సద్వినియోగం చేసుకుని రుణాలు చెల్లించిసహకార బ్యాంకు అభివృద్ధికిసహకరించాలనికోరారు. ఈ కార్యక్ర మంలో విండో డైరెక్టర్లు, సీఈఓ వెంకట్ రాములు, రైతులు పాల్గొన్నారు.

## భార్యపై అనుమానంతో చితకబాధిన భర్త

### భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** భార్యపై అనుమానంతో భర్త ఆమెను క్రరతో చితకబాధడంతో తీవ్ర గాయాల పాలైన సంఘటన మండ లంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఘణపురం గ్రామ తండాకు చెందిన రాత్లావత్ రవి నాయక్ (38) సంవత్సరములుతో రాట్లా వత్ జయ 17 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి నలు గురు సంతానం గత కొన్ని రోజులుగా భర్త ఆమెను అనుమానిస్తూ శారీ రకంగా మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని పెద్దల సమక్షంలో చర్చ లు జరిపినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదని 15 రోజుల క్రితం జయ భర్త రవి కొట్టడంతో తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషులు మళ్ళీ పంచాయతీ నిర్వహించి రాజీ కుదిరించి భర్త దగ్గరికి పంపించారు. ఈ నెల 12న అర్ధరాత్రి తర్వాత భర్త రవి జయతో గొడవపడి క్రరతో ఆమె తల వెన్ను కాళ్లపై తీవ్రంగా కొట్టాడు జయ అరుపులకు తాండాలోని చుట్టుపక్కల వారుఆమెను రక్షించిహైదరాబాదులోని ఆసుపత్రికి పంపించారు. చికిత్స పొంది తిరిగివచ్చిన జయ శుక్రవారం ఉదయం తనను కొట్టి గాయపరిచిన భర్త రవి పై ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు.

## పుల్వమా దాడిలో అమరులైన జవానులకు నివాళులు



అమరులైన జవానులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**పెబ్బేరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** పెబ్బేరు హిందూ జాగ్రత్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు, 2019 ఫిబ్రవరి 14వ తారీఖున జరిగిన పుల్వమా దాడిలో అమరులైన జవానుల కు సుభాష్ చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.దేశ రక్షణలో భాగంగా ఎంతో మందిని తమ ప్రాణాలనులెక్క చేయకుండా కాపాడిదేశ రక్షణలో ముందుం డి పోరాడి అమరులైన జవానుల కోసం నివాళులు అర్పించడం గర్వించదగ్గ విషయమని హిందూ జాగ్రత్త సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగ్రత్త సభ్యులు పట్టణ యువకులు నాయకులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్‌ల పదవీకాలం పొడిగింపు

### హర్షం వ్యక్తం చేసిన బాదేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్



బాదేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్

**జడ్చర్ల, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్ల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ముందుగా ఊహించిన విధంగానే డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ మిగతా జిల్లాల డిసిసిబి చైర్మన్లు, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డా.మల్లురవి సహ కారంతో సింగిల్ విండో చైర్మన్ల పదవీకాలం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ జీవో జారీ కావడం సంతోషంగా ఉందని బాదేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఓ కాపీ త్వరలోనే విడుదల అవుతుందని పేర్కొన్నారు. ఆరు నెలల పదవీకాలం పొడిగించి నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వేసవిలో కరెంటు ఇబ్బందులు రావద్దు

- నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి
- ఎస్ఇ పీవీ రమేష్‌తో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమీక్ష



ఎస్ఇతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:** ప్రజలకు నాణ్యమైన విద్యుత్ ను అందించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పలు అంశాలపై ఎమ్మెల్యేఎస్ఇని అడిగి తెలుసుకున్నారు.వ్యవసాయానికి, ఇంటి అవస రాలకు తగిన విద్యుత్ అందించాలని ఆయన అధికారులకు సూచించార. మహబూబ్‌నగర్‌కు నూతనంగా వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌లను వేసవి కాలం రాకముందే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ పివి రమేష్,ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ , గ్రంథా లయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, షబ్బీర్ అహ్మద్, శ్రీనివాస్ యాదవ్, రాజుగౌడ్, అర్షద్‌అలి,డిఇ(టి)నవీన్‌కుమార్, డిఇ(ఓ) లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

### కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే బీసీలపై కుట్రకు పునుకోవడం కులాల వారిగా విడదీయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని గట్టుకున్నారని కుల గణన పేరుతో ప్రజా ధనాన్ని వృధా చేస్తూ దాదాపు 160 కోట్లు మాయమైపోయాయని తీవ్రస్థాయిలో ముఖ్యమంత్రి పై కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కులగణనపై ముఖ్యమంత్రి బీసీ కులాల ప్రజెంటేషన్ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పై అనుచిత వాక్యాలు చేయడం సరికాదంటూ మండి పడ్డారు. తెలంగాణ క్యాబినెట్‌లో ఎంత మంది బీసీలకు స్థానం కల్పించారో చెప్పాలి అని అన్నారు. బీసీలపై మొసలి కన్నీరు కారుస్తున్న ముఖ్యమంత్రి కి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న జాతీయ స్థాయి నాయకుడు రాహుల్ గాంధీది ఏ కులము అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో మూడు సార్లు దరఖాస్తు చేసుకున్న కొలిక్కిరాని కుల గణన సర్వే ప్రజాధనాన్ని వృధా చేయడమే తప్ప పాలన చేతకాని ముఖ్యమంత్రి అన్నారు. కుల గణన సర్వే మొత్తం తప్పుల తడక అని అన్నారు. ఇతర కులాలను తెచ్చి బీసీ కులంలో కలపడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్రకుల సర్వేలో బీసీలు 53 శాతం ఉంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 42 శాతంగా దొంగ సర్వేలు చూపిస్తూ ప్రతి సంవత్సరం జనాభా పెరుగుతుంటే పది ఏళ్లలో బీసీ కులాల శాతం తగ్గింపు చేసి బీసీల పై కుట్ర చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినట్టు స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించి ఎన్నికలకు వెళ్లాలని లేనియెడల బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అన్నను హత్య చేయించిన తమ్ముడు

### 48 గంటలలో హత్య కేసును ఛేదించిన జోగులాంబ గద్వాల పోలీస్‌లు



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు, డిఎస్పీ మొగులయ్య

**గద్వాల, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** బాగ పరిష్కారాల వివాదంలో తన భర్తకు, భర్త తల్లి దండ్రులకు, అన్నాదమ్ములకు గొడవలు ఉన్నాయని తన భర్త ప్రమాదం పై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు ఇవ్వగా ఆమె ఫిర్యాదు మేరకు శాంతినగర్ పోలీసులు క్రైమ్ నెంబర్ 15/2025 యు/ఎస్ 103,109 ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్ కేసు నమోదు చెయ్యగా శాంతినగర్ సిఐ టాటా బాబు దర్యాప్తు చేపట్టి నిందుతులను 48 గంటలలో పట్టు కోవడం జరిగిందని ఎస్పీ శ్రీనివాస్ రావు తెలిపారు. అమ్మనాన్నలతో,మరో అన్నగోపితో చెప్పి పథకం ప్రకారం చంపాలని నిర్ణయించు కున్నారని ఎస్పీ తెలిపారు. అందుకు మహేష్ తనకు పరిచయం ఉన్న బోయ నర్సింహులు కు విషయము చెప్పి తన అన్న రమేష్ ను చంపితే లక్ష యాభై వేల ఆటో ఇస్తానని డీల్ ఒప్పందం చేసుకొని అందుకు, మరో ఇద్దరు అయిన బండ మిది తిమ్మప్ప, బోయ నాగేంద్ర సహకారం తీసుకొని అందుకు ప్రత్యేక వేట కొడవళ్ళు చేయించి రమేష్ ను చంపాలని పథకం వేసుకున్నారు. అందులో భాగంగా వారంరోజుల కిందట మహేశ్ అన్న రమేశ్ వెంకటపురం స్టేజ్ నుండి యాం దీన్నే కు వెళ్తుండగా బొలెరో తో ఢీ కొట్టి చంపుదాము అనుకున్నారు. కుదరలేధు మరల తేది: 12వ రోజున కోర్టు పని నిమిత్తం రమేష్ తన మామ సుధాకర్ తో కలిసి ఆలంపూర్ కు వెళ్లి యాపదిన్నె గ్రామానికీ వస్తుండగా మహేష్, బోయ నరసింహులు ఒక కారులో వస్తూ, బోయ నరసింహులు బందువులు అయిన బండమీద తిమ్మప్ప, బోయ నాగేంద్ర లు బొలెరో వాహనంలో అనుసరించి అనుకున్న ప్రకారం మద్దూరు స్టేజీ దగ్గరా బొలెరో వాహనంతో రమేశ్ మోటార్ సైకల్ ను టక్కరివ్వగా, రమేశ్,వాళ్ళ మామ సుధాకర్‌లు రోడ్డు కింద పడగ, వెంటనే వెనుకల ఉన్న మహేశ్, బోయ నరసింహులు కార్ ఆపి దిగి, కింద పడిన రమేష్ పై మహేష్ ,బోయ నరసింహులు వెంట తెచ్చుకున్న వేట కొడవలితో రమేష్ గొంతు నరికి చంపారని తెలిపారు. రమేష్ మామ సుధాకర్ పై దాడి చేశాక క్రింద పడిపోగ నిందితులు అదే కార్ లో అక్కడ నుండి పారిపోయారని తెలిపారు. ఒక కారు టిఎస్06ఈ1788, కత్తులు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డిఎస్పీ వై.మోగిలయ్య, స్వియ పర్యవేక్షణలో శాంతినగర్ సీఐ టాటాబాబు ఆద్వర్యంలో ప్రత్యేక టీమ్ ను ఏర్పాటు చేసి సిసి కెమెరాలు, ఇతర సాంకేతిక నైపుణ్యం ఆదారంగా నిందితులను గుర్తించి నమ్మదగిన సమాచారం మేరకు నిఘా ఉంచి పట్టు కున్నట్లు తెలిపారు. వారు అడ్వకేట్ కోసం హైదరాబాద్ కు కారులో పోతుండగా జాతీయ రహదారి పై జల్లపూర్ ఆర్ టి ఏ చెక్ పోస్ట్ దగ్గర శుక్రవారం మధ్యాహ్నం 02:00 గంటలకు నిందితులను అరెస్టు చేసి వారి నుండి ఒక కారు, ముడు కత్తులు, 4 మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించడం లో ప్రతిభ చూపిన ఐజ ఎస్సై, మనోపాడ్ ఎస్సై,సిబ్బంది వెంకప్ప హెచ్‌సి-1118, యాకూబ్ హుస్సేన్ హెచ్‌సి-948, అయ్యన్న పిసి-1202, విష్ణు వర్దన్ పిసి-2192, ప్రసాద్ పిసి-2540, నబీరసూల్ పిసి-2642, తులసి నాయుడు పిసి-3124 లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా క్యాష్ రివార్డ్ తో అభినంధించారు.

## వీరజవాన్లకు ఘన నివాళి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** 2019 ఫిబ్రవరి 14న జమ్ము శ్రీనగర్ జాతీయ రహదారిలో భారతీయ సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్ మీద లేథిపురా కారుతో ఆత్మాహుతి బాంబు దాడి కారణంగా 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సీఆర్పీఎఫ్ సైని కులు,ఒక ఉగ్రవాది మరణించిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడికి నిరసనగా ఉమ్మడి మహబూ బ్‌నగర్ జిల్లాలో కొవ్వొత్తుల శాంతి ర్యాలీ నిర్వహించారు. అమర జవాన్లకు మద్దతుగా నినాదాలు చేశారు. మహబూబ్‌పగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

**జడ్చర్లలో:** భారతదేశం చరిత్రలో అత్యంత దారుణమైన ఉగ్రవాద దాడిలో కనీసం 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారని ఇది దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని, దుఃఖాన్ని రేకెత్తించిందని ప్లైవాక్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాల్వ రామ్ రెడ్డి అన్నారు. అప్పటి నుండి, భారతదేశం ఫిబ్రవరి 14ని అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడానికి, ఉగ్రవాద ముప్పును ఖండించడానికి బ్లాక్‌డేగా పాటిస్తూ ప్లై వాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్చర్ల మినీ స్టేడియంలో అమర వీరులైన జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.

**రాజాపూర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆధ్వర్యంలో రాజాపూర్ మండలంలో పుల్వామా దాడిలో వీరమరణం పొందిన సిఆర్‌పిఎఫ్ జవాన్లను గుర్తుచేసుకుంటు మండలంలోని అన్ని పాఠశాల పిల్లలతో 910ఫిట్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రిటైర్ ఆర్మీ జవాన్లు జాతీయ జెండాతో ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి మండలంలోని పుర విధుల గుండా దేశ భక్తి నినాదాలతో సాగింది. తదనంతరం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహి చడం జరిగింది. పుల్వామా సైనికులకు వారి ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. తిరంగా జెండాకు సహకరించిన ఆర్మీ వాళ్లను సన్మానించి బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఆర్మీ యూనియన్ రాజాపూర్ మండల్ అధ్యక్షులు నరేందర్ ఎయిర్ ఫోర్స్,ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శ్రీను, ప్రస్తుతం సిఐ మాధవచారి సిఆర్‌పిఎఫ్, గిరిధర్ రెడ్డి, నరసింహ, వెంకటయ్య, బాలకృష్ణ, రమేష్,ఆంజనేయులు, వెంకట్, ఏబీవీపీ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్డెన్ సెర్చ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు దివిటిపల్లి బెద్రూం కాలనీలో శుక్రవారం ఉదయం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. మహ బూబ్ నగర్ రూరల్ పోలీసుల కమ్యూనిటీ కనెక్టింగ్, కార్డన్ సెర్చ్‌లో భాగంగా అనుమానాస్పద వాహనాల తనిఖీ, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ అవగాహన, శాంతి భద్రతల పర్యవేక్షణ నిర్వహించారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 35 మోటర్ బైకులు, 9 ఆటో రిక్షాలు 2 కార్లు అనుమానాస్పదంగా ఉండడంతో, అవసరమైన ధృవీకరణ కోసం పోలీసులు నిలిపివేశారు. కాలనీలో నివాసం ఉండే అస్పష్టమైన వివరాలతో ఉన్న వ్యక్తులపై విచారణ చేపట్టారు. కొన్ని ఇళ్లలో అసాధారణ కదలికలు గమనించి,మౌలిక సమాచారం సేకరించారు.ఈ సందర్భంగాఅదనపు ఎస్పీరాములు మాట్లా డుతూ, ప్రజల భద్రత మా మొదటి ప్రాధాన్యత అన్నారు. కార్డన్ సెర్చ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులను, అక్రమ కార్యకలాపాలను గుర్తించేందుకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు తమ పరిస రాల్లో అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల గురించివెంటనే పోలీసులకు సమాచారం అందించాలని" అని తెలిపారు.మహబూబ్ నగర్ పోలీసులు ప్రజల రక్షణకు కట్టుబడి ఉన్నారని, శాంతి భద్రతలను కాపాడేందుకుఇటువంటి తనిఖీలుతరచుగా కొనసాగుతాయని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, పర్యవేక్షణలో,డీఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డీఎస్పీ రమణా రెడ్డి, మహబూబ్‌నగర్ రూరల్ సిఐ గాంధీ, ఎస్ఐ విజయ్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు ఎస్సైల బదిలీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** జోగులాంబ జోన్ నుంచి ఇద్దరు ఎస్సైలను బదిలీ చేసినట్లు జోగులాంబ జోన్7 డి ఐ జి ఎల్ఎస్ చౌహాన్ తెలిపారు. సీసీ కుంట సబ్ ఇన్స్పెక్టర్ శేఖర్‌ను విఆర్ నారాయణపేటకు, రామ్లాల్ విఆర్ ఎస్ఐ నారాయణపేట జిల్లా నుంచి సీసీ కుంట ఎస్ హెచ్ ఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఘనంగా సంతోషీమాత 13వ వార్షికోత్సవం

**జడ్చర్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** బాదేపల్లి పట్టణంలో విద్యానగర్ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ సంతోషీమాత ఆలయంలో శుక్రవారం మాఘ బహుళ విదియ శుక్రవారం అమ్మవారి 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో భక్తులచే అమ్మవారికి క్షీరాభిషేకం, అమ్మవారికి విశేష అలంకరణ సంతో షీమాత హవనం, అమ్మవారికి కనకాభిషేకం, మహిళలచే సువాసిని సహిత సామూహిక కుంకు మార్చనలు తదుపరి మహార్నివేదన పల్లకి సేవ భజనలు, భక్తి గేయాలు, ఆలయంలో మారు మోగించారు తదుపరి మహామంగళహారతి తీర్థప్రసాద వితరణ, అన్నదాన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహిళా భక్తులు కాలనీవాసులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు

### శేష వాహనంపై ఊరేగిన వెంకటేశ్వర స్వామి

**మహబూ'బ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మన్యంకొండ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మన్యంకొండలో గురువారం రాత్రి దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవం జరిగిన మరుసటిరోజు ధూపోత్సవ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న ది. ఉమ్మడి జిల్లా నుంచి కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివ స్తున్నారు.అలాగే శుక్రవారం స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు శ్రీ చక్రస్థానం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ వంశపారంపర్య ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్, అలహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాస రాజు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన జితేందర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి మరియు తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో కలిసి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రికి వివరించి వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## వటవర్లపల్లి గ్రామ పునరావాసానికై

# ప్రత్యేక ప్రణాళిక

■ వటవర్లపల్లి గ్రామ పునరావాసాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి..

■ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి14 ప్రభాత వార్త:** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియా నుండి వటవర్లపల్లి గ్రామం తరలింపుపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశాన్ని వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. నల్లమల్ల ప్రాంతంలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాంతా ల్లోని వటవర్లపల్లి గ్రామ తరలింపు ప్రక్రియకు ఎలాంటి ఒత్తిడి లేకుండా గ్రామ సభలో తీర్మా నించి, సుముఖతం వ్యక్తం చేసిన 671 కుటుం బాల పునరావాసాన్ని నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత శాఖల అధికా రులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్‌అధ్యక్షతన అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ లోతో కలిసి అమ్రాబాద్ కోర్ ఏరియాలో నివసించే వటువర్లపల్లి గ్రామవాసుల కోసం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం నుంచి స్వచ్ఛందంగా తరలి వెళ్లేందుకుముందుకొచ్చి ప్రతిపాదించిన వట్టు వర్లపల్లి గ్రామ పునరావాసం గ్రామసభ, జిల్లా స్థాయి కమిటీ సమావేశాల్లో ప్రజల స్వచ్ఛందంగా తమ సమ్మతిని తెలియజేయాలని వివరించారు. సంబంధిత శాఖలతో సమన్వ యం చేసుకుం టూ పనులు త్వరగా పూర్తి చేయా లని ఆదేశిం చారు. వటవర్లపల్లి గ్రామంలో 671 కుటుంబా లను గుర్తించగా.. అందులో 311 కుటుంబాలు రూ.15 లక్షల పరిహారం తీసుకో నున్నట్లు వారు గ్రామసభలో వెల్లడించారని, మిగిలిన 360 కుటుంబాలకు బాకారం సమీపంలో ఒక్కో కుటుంబానికి 220 గజాల ఇంటి నిర్మాణానికి స్థల కేటాయింపుతో పాటు వ్యవసాయ జీవనో పాధికి ప్రతి కుటుంబానికి 2 ఎకరాల వ్యవసాయ భూమిని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం కోసం కేటాయించిన ప్రాంత అభివృద్ధికి సంబం ధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పునరావాసం కోసం కేటాయించిన ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం, తాగునీరు,విద్యుత్ సౌకర్యం,అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, గ్రామ పంచాయతీ భవనం నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అడవిలో ప్రజల సంచారాన్ని తగ్గించేందుకు టైగర్ రిజర్వ్ ప్రాంతానికి ముప్పుగామారకుండా పునరావాసం చేపట్టినట్లు, రక్షిత అటవీ ప్రాంతాలు, పులుల ఆవాసాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. అడవుల్లో జనసంచారం, పెంపుడు జంతువుల ద్వారా తలెత్తే సమస్యలను తగ్గించటమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. వటవర్లపల్లి గ్రామం లోని రెవిన్యూ భూమిని, ఆస్తుల వివరాలను లెక్కించాలని అధికారులను ఆదేశించారు. వటవర్లపల్లి గ్రామంలోని పునరావాసం కొరకు నుండి 773 దరఖాస్తులు వచ్చాయని వివిధ కారణాలతో 102 కుటుంబాలను అనర్హులుగా గుర్తించినట్లు, 671 కుటుంబాలను అర్హులుగా గుర్తించినట్లు, 311 కుటుంబాలు రూ.15 లక్షల పరిహారం తీసుకోవాలని నిర్ణయించగా. మిగిలిన 360 కుటుంబాలకు బాచారం సమీపంలో అటవీ భూమిని పునరావాసం కొరకు సిద్ధం చేసినట్లు, ప్రతి కుటుంబానికి 220 గజాల ఇంటి స్థలంతో పాటు 2 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అంతకన్నా ముందు వటువర్లపల్లి వాసులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు పనులపై గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసి పునరావాసనికి తరలి వెళ్లేందుకు అంగీకరించారు. అనంతరం సంబంధిత శాఖ అధికారులకు వారి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల సమయంలో భయం వద్దు

◆ విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

◆ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం



మాట్లాడుతున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి14 ప్రభాతవార్త:** పరీక్షల సమ యంలో భయంతో కాకుండా ఏకాగ్రతతో చదివితే పరీక్షలను సుల భంగా రాయవచ్చని నాగర్‌కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం విద్యార్థులకు సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నాగం కర్నూల్ పట్టణంలోని సుఖ జీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల వసతి గృహాల 10వ తరగతి విద్యా ర్థులకు 10వ తరగతి పరీక్షలపై నిర్వహించిన ప్రేరణ తరగతుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్షల సమ యంలోఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని, ఉపాధ్యాయులు బోధించిన ప్రతీ అంశాన్ని శ్రద్ధగా అర్థం చేసుకుని ప్రశాంతగా పరీక్షలు రాయా లన్నారు.10వ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థుల్లో భయాన్ని తొలగించడానికే ఈ అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించామన్నారు.అనవసరమైన ఆలోచనలు చేయ కుండా ఏకాగ్రతతో ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలన్నారు. ఏదైనా సందేహం ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవా న్నారు. చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. భయం తో రాయడం వల్ల మార్కులు తక్కువగా వస్తాయని, భయం వీడి పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధిస్తామని తెలిపారు. విద్యా ర్థులు కష్టాన్ని ఇష్టంగా భావించి, కాలాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదివి అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. సైకాలజిస్ట్ లక్ష్మణ్, వివిధ సబ్జెక్టులో నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు అత్యధిక మార్కులు సాధించడానికి పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజిం అలీ అప్సర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రవణ్ కుమార్, సహాయ అధికారులు శ్రీరామ్, శ్రీకర్ రెడ్డి, పాండునాయక్, ఆయా సంక్షేమ శాఖల హాస్టల్ వార్డెన్లు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు వెడల్పు పనులలో

## గృహ యజమానులకు నష్టం కలగకుండా చూడాలి

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త :** రోడ్డు వెడల్పు పనుల్లో గృహ యజమానులకు నష్టం కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ మీటింగ్ హల లో కోస్గి రోడ్డు వెడల్పు పనులపై తహసీల్దార్ మున్సిపల్ అధికా రులు ఇళ్ళు, వ్యాపార సముదాయాలు కోల్పోయే వారితో డిస్ట్ లెవెల్ నెగోషియేషన్ సమావేశం (డిఎల్ఎన్ సి)నిర్వహించారు. దాదాపు(40)మంది హాజరుఅయ్యారు.ఈ సందర్భంగా రూ.4200 స్క్వేర్ యాడ్ ప్రకారం రెసిడెన్షియల్ ప్లాట్స్ కు, రూ. 11,600 కమర్షియల్ షాప్‌లకు నష్టపరిహారం ఇవ్వటానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది .ఈ సందర్భంగా 188 మందికి గాను, 165 మంది ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారం తీసుకొనుటకు సమ్మతి తెలిపినట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలం,ఎస్ఈ ఆర్‌బి,ఆర్డీవోరామచంద్ర,తహసీల్దార్, బక్క శ్రీని వాస్,నాగరాజు కమిషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల



**భూత్పూర్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తనయ ప్రీతిరెడ్డి వివాహం వచ్చే 6న జరుగనున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆల శుక్రవారం బీఆర్ ఎస్ అధినేత,తెలంగాణ తొలిసీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావ (కేసీఆర్)ను హైదరాబాద్ లోని కేసీఆర్ నివాసంలో స్వయంగా కలిసి శాలువతో సత్కరించి తన కూతురి వివాహమహోత్సవ ఆహ్వాన పత్రికను అందించి,తన కూతురుపెళ్లికి రావాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆహ్వానించారు.

## ఘనంగా ఇంగ్లీషుబాషా దినోవత్సం

**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త:** నేడు ప్రభుత్వ బేన్ ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషుభాష దినోత్సవ కార్య క్రమం నిర్వహించడం జరిగింది.టిఎల్ఎం మేలా నిర్వహణ ఆకట్టు కుందనిపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ విజయ్ కుమార్, ఆంగ్ల ఉపాధ్యాయులు చంద్రకాంతరెడ్డి,ఖలీం, స్వప్న తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






### ఇక మహానగరమే..

**క్లీన్ సిటి, గ్రీన్ సిటిగా మార్చుకుందాం : ఎమ్మెల్యే యెన్నం**

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మహబూ బ్‌నగర్ ఇక మహానగరమే అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన సందర్భంగా మహ బూబ్‌నగర్ మహా నగరోత్సవం నిర్వహించుకుంటున్న శుభ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాలకు ఎమ్మెల్యే సతీమణి ప్రసన్నలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న వాళ్ళకే కాదు తెలం గాణలో ఉన్న వాళ్ళకే కాదు ప్రపంచం మొత్తం కూడా సగర్వంగా చెప్పుకోవడానికి ఈ మహబూబ్ నగర్ మహా నగరోత్సవాన్ని మనం ఈరోజు మొట్టమొదటిసారిగా నిర్వహించుకుంటున్నామని, మున్సిపల్ కార్పొరేషన్‌గా మన మహబూబ్ నగర్ రూపాంతరం చెందుతున్నామంటే రేపు భవిష్యత్తులో మన మహబూబ్‌నగర్ , హైదరాబాద్ నగరం అంత ప్రసిద్ధం చెందాలని ఆయన ఆకాంక్షించారు. మన నగరంలోని వసతులు పెంచుకోవాలి, మన నగరంలోని రోడ్లు , డ్రైన్‌లు అన్ని అభివృద్ధి చేసుకోవాలని, అంతే కాకుండా మన నగరాన్ని క్లీన్ సిటీగా, గ్రీన్ సిటీగా కూడా మార్చుకోవాలి ఇది మన అందరి బాధ్యత.మహబూబ్‌నగర్ ఉత్సవాలను పురస్కరించుకుని మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 20 చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, షబ్బీర్ అహ్మద్, జహీర్, ఫయాజ్, పీర్ మహ్మద్ సాదిక్, అక్బర్,అర్షద్‌అలి,రాజుగౌడ్, మోయిజ్,తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా మహానగరోత్సవం

◆ రెండు రోజుల వేడుకకు ముస్తాబైన పాలమూరు శిల్పారామం

◆ స్టాల్స్, ఫన్ గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు

◆ నగర ప్రజల నుండి విశేష స్పందన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మన మహబూబ్ నగర్ మహానగరోత్సవంను మహబూబ్‌నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి మహబూ బ్‌నగర్ శిల్పారామంలో శుక్రవారం ప్రారంభించారు. మహ బూబ్‌నగర్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటు అయిన సంద ర్భంగా రెండు రోజుల పాటు మార్కెట్ స్టాల్ లు ఏర్పాటు, ప్రభుత్వ స్టాల్‌లు, ఫన్ గేమ్స్ , సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మార్కెట్ స్టాల్ లను మహబూబ్‌నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిలు పరిశీలించారు. తొలుతమున్సిపాలిటీ స్వచ్ఛ వాహనాలు ప్రారంభించారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిం చారు. సాంస్కృతిక కార్యక్రమాలను శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిలు తిలకించారు. మహబూబ్‌నగర్ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ ఎన్నో సంవత్సరాలుగా మున్సి పాలిటీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయడం జరిగింది. మహబూబ్ నగర్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసేందుకు అందరూ చేయూతనివ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథా లయ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



